క్లుప్తంగా

నేడు దాడితల్లి అమ్మవారి వారాల సంబరాలు


దాడితల్లి అమ్మవారు

బొబ్బిలి: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు దాడి తల్లి అమ్మవారి పండగలో భాగంగా దేశమ్మతల్లి వారాల సంబరాలను ఆదివారం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు మండల జనార్ధనరావు, వజ్జి రవికుమార్, సర్వసిద్ధి సాయి హేమంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఆదివారం సాయంత్రం గొల్లపల్లి వేణుగోపాల మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటామని తెలిపారు.గ్రామస్తులు, భక్తులు సంబరాల్లో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

వంగర తహసీల్దార్‌గా రామారావు


పి.రామారావు

వంగర: మండల తహసీల్దార్‌గా పిన్నింటి రామారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గత కొంత కాలంగా రాజాం తహసీల్దార్ బి.రాజశేఖర్ ఇక్కడ ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. తాజాగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వంగర, రేగిడి మండలాల సీఎస్‌డీటీగా పనిచేస్తున్న రామారావుకు పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగించారు. బాధ్యతల స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని తెలిపారు.

17న రక్తదాన శిబిరం


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బొబ్బిలి: ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా ఈనెల17న బొబ్బిలిలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బొబ్బిలి, రామభద్రపురం,తెర్లాం మండలాల బీజేపీ అధ్యక్షులు తాడ్డి ఈశ్వరరావు, మూడడ్ల ఆదిలక్ష్మి,గొల్లపూడి సాయికుమార్ తెలిపారు. పట్టణంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యువకులు పెద్ద ఎత్తున హాజరై రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని హాజరు కానున్నట్టు తెలిపారు.

నిత్యావసర సరుకుల అందజేత


కృష్ణంరాజుకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న మానవతా సంస్థ సభ్యులు

రాజాం: పట్టణంలోని గాయత్రీకాలనీకి చెందిన ఎస్.కృష్ణంరాజు అనే వ్యాధిగ్రస్తునికి స్థానిక మానవతా స్వచ్ఛంద సంస్థ నిత్యావసర సరుకులు శనివారం అందజేసింది. మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణంరాజును దాతలు ఆదుకోవాలని కోరారు. సంస్థ సభ్యులు బి.వి.అచ్యుతరావు, గట్టి పాపారావు, ఆర్.వి.జె.నాయుడు, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, తదితరులు కోరారు.

చెరువుకు గండి


ఇసుక బస్తాలతో గండిని పూడ్చిన ప్రాంతాన్ని చూపిస్తున్న రైతు

రేగిడి: సంకిలి గ్రామ సమీపంలోని ఊట చెరువుకు శుక్రవారం రాత్రి గండిపడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గట్టుబలహీనపడి రెండు మీటర్ల మేర కోతకు గురైంది. రైతులు అప్రమత్తమై శనివారం ఉదయం ఇసుక బస్తాలతో తాత్కాలికంగా గండిని పూడ్చారు. పూర్తిస్థాయిలో గండిని పూడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సాయన్నచానల్ నీటి సంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు కోరారు.

పరిమితంగా ఎరువులు వాడాలి

రేగిడి: పంటలకు రసాయన ఎరువులను పరిమితంగా వినియోగించాలని, మోతాదు మించితే అనర్థమేనని ఏఓ బి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉప్పర్నాయుడువలస, వన్నలి, అక్కన్నఅగ్రహారం తదితర గ్రామాల్లో రైతులకు వరి, తదితర పంటల్లో సస్యరక్షణ చర్యలతో పాటు నానో యూరియా వినియోగంపై శనివారం అవగాహన కల్పించారు. వ్యవసాయ సిబ్బంది సూచనలు, సిఫార్సు మేరకే పంటలకు ఎరువులు వేయాలని, పురుగు మందులు పిచికారీ చేయాలని చెప్పారు.

నాగావళిలో ఇసుక తోడేళ్లు..!

- నాగావళిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు
- అనుమతుల పేరిట అక్రమ రవాణా
- రీచ్ నిర్వహణకు గడువు పెంచారంటూ తవ్వకాలు
- 5 నుంచి 8 మీటర్ల లోతున ఇసుక అగాధాలు
- నిబంధనలను బేఖాతరు చేస్తూ 60 టన్నుల సామర్థ్యం గల లారీలతో రవాణా
- ఛిద్రమవుతున్న రోడ్లు
- అధికార పార్టీ నేతల అండదండలు


మేడమర్తి వద్ద నాగావళి నుంచి లారీల్లో తరలిపోతున్న ఇసుక

రాజాం/సంతకవిటి : సంతకవిటి మండలంలో నాగావళి నది గుల్లవుతోంది. నారాయణపురం ఆనకట్టకు, రంగారాయపురం వద్ద వంతెనకు కూతవేటు సమీపంలో టన్నుల కొద్దీ ఇసుక నది నుంచి మాయమవుతోంది. నిబంధనలకు అతీతంగా రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక లారీలు గుర్రుపెట్టి పరుగులెడుతున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో రోడ్లన్నీ పాడుతున్నాయి. ప్రజలను రహదారి కష్టాలు వెంటాడుతున్నాయి.

ఆరు నెలల క్రితమే ముగిసినా..

సంతకవిటి మండలం తమరాం వద్ద 2024 ఏడాది సెప్టెంబర్ నెలలో ఇసుక రీచ్‌కు ప్రభుత్వం వేలం నిర్వహించింది. ఈ రీచ్‌ను శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ టీడీపీ కార్యకర్త(అతను ఓ ప్రభుత్వ ఉద్యోగి) దక్కించుకున్నాడు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ఇక్కడ ఇసుక రీచ్ నిర్వహణకు తెర తీశాడు. ఆరంభంలో ట్రాక్టర్లకు ఇసుక ఎత్తుకు నేందుకు అవకాశం ఇచ్చిన ఈ రీచ్ నిర్వాహకులు అనంతరం ట్రాక్టర్లకు అనుమతి నిలిపి వేశారు. 2025 మార్చి నెల వరకు మాత్రమే ఇక్కడ రీచ్ నిర్వహణకు అనుమతులు ఉండగా, గడువు పెంచారని చెప్పి ఇప్పటికీ ఇసుక రీచ్‌ను నడిపిస్తున్నారు. గతంలో తమరాం సమీపంలో ఉన్న రీచ్‌ను ఇప్పుడు మేడమర్తి గ్రామసమీపానికి మార్చి నదిలో కిలోమీటరు మేర బాటలువేసి, గుట్టలుగా ఇసుకపోగులు నిల్వ చేశారు. ఎక్కడైనా ఇసుక రీచ్‌లు వద్ద 1.5 మీటర్ల నుంచి 2.5 మీటర్ల లోతు వరకు మాత్రమే ఇసుక త్రవ్వకాలు చేయాలి.కానీ ఇక్కడ 5 నుంచి 8 మీటర్ల లోతున తవ్వకాలు చేస్తున్నారు. 32,393 క్యూబిక్ మీటర్ల ఇసుక తీసేందుకు అప్పట్లో రీచ్ మంజూరు చేయగా, అంతకు అయిదింతలు మేర తవ్వకాలు జరిపినట్లు అనుమానాలు ఉన్నాయి. ఇక్కడ నుంచి రాత్రి పగలు తేడాలేకుండా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది.


నది పక్కనే ఇసుక గుట్టలు


నదిలో వేసిన రోడ్డులో కూరుకుపోయిన లారీని ప్రొక్లెయిన్‌తో నెడుతున్న దృశ్యం

నాకేమీ తెలియదు

మేడమర్తి వద్ద ఇసుకరీచ్‌కు సంబంధించి నాకు ఎటువంటి సమాచారం లేదు. వీఆర్ఓ ద్వారా వివరాలు అడిగితే మైనింగ్ అధికారులు చూసుకుంటున్నారులే అని నిర్వాహకులు తేల్చేశారు. రీచ్‌కు సంబంధించి ఏ సమాచారం నా వద్ద లేదు. నేను ఏరకమైన చర్యలు తీసుకోలేని పరిస్థితి ఇక్కడ ఉంది. – బి.సుదర్శనరావు, తహసీల్దార్, సంతకవిటి మండలం

స్థానిక ఎమ్మెల్యే అండదండలు..!

మేడమర్తి వద్ద ఇసుకరీచ్ నిర్వహణకు రాజాం ఎమ్మెల్యే అండదండలు, సహకారం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అతని సోదరుడు ఈ రీచ్ నిర్వహకుల మధ్య ఒప్పందం ఉందని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. రీచ్ వద్ద లోకేష్ అనే వ్యక్తి రీచ్ యజమానికి, ఎమ్మెల్యే సోదరునికి మధ్య వారధిలా వ్యవహరించడంతో పాటు అటు రెవెన్యూ, ఇటు పోలీస్ యంత్రాంగాన్ని నడిపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఇసుక రీచ్‌కు సంబంధించిన అనుమతి పత్రాలు, రీచ్ పొందిన సంస్థ వివరాలు ఏవీ అక్కడ లేకుండా జాగ్రత్తలు పడుతున్నారు. ఇటీవల ఈ రీచ్‌పై ఫిర్యాదులు వెళ్లడంతో పదిరోజుల పాటు రీచ్‌ను నిలుపుదలచేసి, మైనింగ్ అధికారుల పరిశీలన అనంతరం మళ్లీ యథావిధిగా రీచ్ కొనసాగిస్తున్నారు.

రోడ్లన్నీ గుల్లే

ఇసుక రీచ్‌లు నుంచి పది టన్నుల కెపాసిటీ, 17 టన్నుల కెపాసిటీ లారీల్లో సరఫరాకే అనుమతులు ఉన్నాయి. ఇక్కడ మాత్రం 20 టన్నులు, 22.5 టన్నులు, 21 టన్నులతో పాటు రాత్రి సమయాల్లో 14 టైర్ల లారీలు ద్వారా ఏకంగా 60 టన్నుల ఇసుకను రవాణా చేస్తున్నారు. ఈఇసుక లారీల రాకపోకలతో సంతకవిటి-పొందూరు ప్రాంతాల మధ్య రహదారి అధ్వానంగా మారింది. మందరాడ-చింతలపేట గ్రామాల మధ్య రహదారి రెండుగా చీలిపోతోంది. మరో వైపు హొంజరాం-మల్లయ్యపేట గ్రామాల మధ్య గతంలో కోటి రూపాయలతో నిర్మించిన తారురోడ్డు పూర్తిగా శిథిలమై ప్రస్తుతం బురదరోడ్డుగా మారిపోయింది. పి.జె.పేట వద్ద నారాయణపురం కాలువ కల్వర్టు పూర్తిగా విరిగిపోయింది. రాజాం-సంతకవిటి ప్రాంతాల మధ్య గరికిపాడు వద్ద కల్వర్టులు దెబ్బతిన్నాయి. ఈ మార్గంలోని గ్రామాల ప్రజలు ఇసుకలారీలు అడ్డుకుని గతంలో ధర్నాచేస్తే, పోలీసులు ప్రజలను నిలువరించి, ఇసుక రవాణాకు అండగా నిలిచిన సందర్భాలు ఉన్నాయి.

స్టాక్ పాయింట్ పేరుతో..

మేడమర్తి వద్ద ఇసుకరీచ్‌కు వస్తున్న లారీలకు ఎటువంటి రశీదులు ఇవ్వడంలేదు. ఇవన్నీ జిల్లాలోని బొబ్బిలి, డెంకాడ, కొత్తవలస ప్రాంతాల వద్ద ఇసుక స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నామని చెబుతున్నారు. వాస్తవానికి ఆయా ప్రాంతాల్లో ఒక్కచోటకి కూడా ఇక్కడ నుంచి ఇసుక వెళ్లడంలేదు.స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులను తమ గుప్పిట్లోకి తీసుకొచ్చి ఇక్కడి ఇసుకను పొందూరు, లావేరు ప్రాంతాల మీదుగా నేషనల్ హైవేమీదకు పంపిస్తున్నారు. అక్కడి నుంచి విశాఖపట్నానికి తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం అనుమతులున్న ఇసుక రీచ్‌ల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల లోపు మాత్రమే ఇసుక తరలించాలి. ఇక్కడ మాత్రం రాత్రి సమయాల్లో అత్యధికంగా 12 నుంచి 60 టన్నుల వరకు సామర్థ్యం ఉన్న లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు.


ముక్కలైన మందరాడ-చింతలపేట మధ్య రహదారి


మట్టి రోడ్డుకంటే అధ్వానంగా మారిన హొంజరాం-మల్లయ్యపేట తారురోడ్డు

పాలకవర్గం నిద్రపోతోందా..?

- రైతులకు ఇన్ని కష్టాలు తెచ్చిపెడతారా..?
- విలేకరుల సమావేశంలో రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ రాజేష్


మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రాజాం: రాష్ట్రంలో పాలకవర్గం ఉందా..నిద్రపోతోందా అని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మండిపడ్డారు. రాజాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువుకోసం పడుతున్న కష్టాల పై ధ్వజమెత్తారు.పక్క జిల్లాలో వ్యవసాయ శాఖ మంత్రి ఉన్నప్పటికీ ఇక్కడ రైతులకు కష్టాలు తప్పడంలేదని ఆరోపించారు. స్థానికంగా ఉన్న పాలక పార్టీ నేతలు కూడా ఎక్కడా కనిపించడంలేదని విమర్శించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు ఎంత మేర యూరియా అవసరమో అధికారులు ముందుగానే అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించినప్పటికీ పాలకులు మొండికేశారని అన్నారు. ముందస్తుగా వ్యవసాయశాఖ అధికారులు ఇచ్చిన సలహాలు పాటించి ఉంటే ఈ సమస్య ఉండేదికాదని పేర్కొన్నారు. వరి నాట్లు వేసి 40 రోజులు గడుస్తోందని, ఇంతవరకూ రైతులకు సరిపడా యూరియాను ఈ ప్రభుత్వం ఇవ్వలేకపోయిందని దుయ్యబట్టారు. రాజాం నియోజకవర్గానికి అవసరమైన ఎరువుల మొత్తంలో పావలా వంతు కూడా ఈ ప్రభుత్వం పంపిణీ చేయలేదని మండిపడ్డారు. యూరియా కోసం రైతులు క్యూలో నిల్చొని కష్టాలు పడుతుంటే, అధికార పార్టీ కార్యకర్తల కు మాత్రం దొడ్డిదారిలో సరఫరా అయిపోతోందని ఆరోపించారు.యూరియా కొరతను నివారించాలని, లేకుంటే రైతులతో కలిసి రోజువారీ నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందని ప్రభుత్వాన్నిహెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, వ్యవసాయ సలహా మండలి మండల మాజీ అధ్యక్షుడు కోనారి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎంపీపీలు, సర్పంచ్‌లకు శిక్షణ

బొబ్బిలిరూరల్: నియోజకవర్గంలోని తెర్లాం ,బాడంగి,బొబ్బిలి మండలాల సర్పంచ్ లు,ఎంపీపీలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 15,16వ తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అల్లుభాస్కరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాభివృద్ధి ప్రణాళికలు,బంగారు కుటుంబాల దత్తత, మార్గదర్శులను తీర్చిదిద్దడం, తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని, ఎంపీపీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. .

పటువర్ధనంలో వైద్యశిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి ఈశ్వరరావు

వంగర: మండలంలోని పటువర్ధనం గ్రామంలో అరసాడ పీహెచ్‌సీ ఆధ్వ ర్యంలో శనివారం వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. వైద్యాధికారి కలమట ఈశ్వరరావు, సిబ్బంది కలిసి శిబిరంలో 90 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

గర్భిణులు, చిన్నారులకు టీకాలు తప్పనిసరి


వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న సీహెచ్‌ఓ భాస్కరరావు

తెర్లాం: గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి అని తెర్లాం పీహెచ్‌సీ సీహెచ్‌ఓ భాస్కరరావు అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-5లో శనివారం వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సచివాలయ ఎంఎల్‌హెచ్‌పీ శ్రీదేవి, స్థానిక ఏఎన్ఎంలు వైద్యతనిఖీలు చేయడంతో పాటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమాన్ని సీహెచ్‌ఓ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా గర్భిణులు, చిన్నారులకు వైద్య తనిఖీలు చేయాలని, టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ సిబ్బందిని నిలదీత

వంగర: మండల పరిధి వి.వి.ఆర్.పేట పంచాయతీలో ట్రాన్స్‌ఫార్మర్ మార్పు విషయంలో విద్యుత్‌శాఖ సిబ్బందిని గ్రామస్తులు నిలదీశారు.గ్రామంలో ఇదివరకు ఉన్న 100 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ సిబ్బంది శనివారం తొలగించి, దాని స్థానంలో 60 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. ఇప్పటికే గ్రామంలో లోవోల్టేజీ సమస్య ఉందని, ఎక్కువ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, తక్కువ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎలా ఏర్పాటు చేస్తారని సర్పంచ్ బత్తిన గురువులు, గ్రామస్తులు సిబ్బందిని నిలదీశారు.కాసేపు వాగ్వాదం జరిగింది. కొద్ది రోజుల తర్వాత తిరిగి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని సిబ్బంది హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

పరామర్శ


షేక్‌అమీర్ సాహెబ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి,తదితరులు

బాడంగి: స్థానిక చికెన్ సెంటర్ యజమాని, వైఎస్సార్‌సీపీ అభిమాని షేక్‌అమీర్ సాహెబ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు శనివారం పరామర్శించారు.మృతుడు షేక్‌అమీర్ సాహెబ్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య, కుమారులను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ,తాను ఎప్పుడూ అండగా ఉంటామని వారికి శంబంగి భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో బొబ్బిలి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.వి.మురళీకృష్ణ, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహా దారు తెంటుమధు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యామలిశివప్రసాద్, పార్టీ నియోజకవర్గ యూత్, విద్యార్థివిభాగ అధ్యక్షులు బేతనపల్లి శంకరరావు,తెంటు తిరుపతిరావు, సీనియర్ నాయకుడు ముగడ వెంకటరమణ, పార్టీ మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, ప్రధాన కార్యదర్శి తెర్లిశ్రీను, బంగారురాజు ఉన్నారు.

మాజీ సైనికుల హక్కుల కోసం పోరాడదాం


సమావేశమైన మాజీ సైనికులు

బొబ్బిలి: యువ ప్రాయమంతా దేశ సేవలో పణంగా పెట్టి రక్షణగా ఉండి రిటైర్ అయిన సమయంలో ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందడం తమ హక్కు అని మాజీ సైనికుల సంఘం గౌరవాధ్యక్షుడు మరడ అప్పారావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక పాత బొబ్బిలి పెట్రోల్ బంక్ వద్ద వీరబొబ్బిలి మాజీ సైనికుల సంఘ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనికుల హక్కుల కోసం ఒకే వేదికపై సమష్టిగా ఉంటూ పోరాడదామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంఘ కార్యాలయానికి భవననిర్మాణం,పెన్షన్ సమస్యలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, కుటుంబ సభ్యుల సంక్షేమ కార్యక్రమాల గురించి చర్చించి, ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షుడు బి.తిరుపతిరావు,సభ్యులు రెడ్డి అప్పలనాయుడు,ఆర్ వెంకటనాయుడు, తెంటు సత్యారావు, సబ్బాన సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం


వంగర: వి.వి.ఆర్.పేటలో సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, పెద్దలు


రాజాం: వార్డు సచివాలయ సిబ్బంది వసంతనాగేశ్వరరావును సత్కరిస్తున్న మున్సిపల్ కార్యాలయ సిబ్బంది

వంగర: మండలంలోని వి.వి.ఆర్.పేట సచివాలయంలో పనిచేసి బదిలీ అయిన ముగ్గురు ఉద్యోగులను సర్పంచ్ బత్తిన గురువులు, ఉప సర్పంచ్ మరిచెర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు.బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శి దార సురేష్ కుమార్, డిజిటల్ అసిస్టెంట్ ముడిదాన ప్రసాద్, మహిళా సంక్షేమ కార్యదర్శి జ్యోతికి జ్ఞాపికలు అందజేశారు.అలాగే కొత్తగా వచ్చి విధుల్లో చేరిన ఆరుగురు సిబ్బందిని సన్మా నించారు.వైఎస్సార్‌సీపీ అనుబంధ ఉపాధ్యాయం విభాగం అధ్యక్షుడు మరిచర్ల గంగా రావు, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీకి...

రాజాం: పట్టణంలోని లచ్చయ్యపేట వార్డు సచివాలయం-1 శానిటేషన్ అండ్ ఎన్విరాన్ మెంట్ సెక్రటరీ వసంత నాగేశ్వరరావు శ్రీకాకుళం కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన్ని రాజాం మున్సిపల్ కార్యాలయ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. వార్డు సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక రోగాలు నయం


వైద్యసేవలందిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి అశ్రిత

రామభద్రపురం: ఆయుర్వేద వైద్యం మన సంప్రదాయ వైద్యమని, ఆయుర్వేద మందులు దీర్ఘకాలిక రోగాలను నయం చేస్తాయని బూసాయవలస ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి జి.అశ్రిత అన్నారు. ఆస్పత్రిలో శనివారం పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ పూర్వం ఆయుర్వేద ఆస్పత్రులకు రోగుల తాకిడి ఎక్కువగా ఉండేద ని, మధ్యకాలంలో ఇంగ్లిష్ మందులకు ప్రజలు అలవాటు పడ్డారన్నారు. ఇప్పుడిప్పుడే మళ్లీ ఆయుర్వేద ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు.ఇక్కడి ఆస్పత్రిలో అన్ని రకాల రోగాలకు వైద్య పరీక్షలు చేసి, వ్యాధి లక్షణాలను బట్టి ఆయుర్వేద మందులు అందజేస్తున్నామని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న రైతు శిక్షణ కేంద్రం ఏఓ నిర్మల

రేగిడి: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని విజయనగరం రైతు శిక్షణ కేంద్రం ఏఓ నిర్మల సూచించారు మండలంలోని చాటాయివలస రైతుసేవా కేంద్రంలో ప్రకృతివ్యవసాయంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు మోతాదుకు మించడంతో భూమి సారవంతం కోల్పోతోందని, ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతున్నాయని చెప్పారు. పంటలు వేసేముందు ఆవుపేడ, గొర్రె గత్తం, చెరువు మట్టి వేయాలని, నవధాన్యాలు, పచ్చిరొట్ట, కట్టెజనుమ వంటి వాటిని సాగు చేసి కలియ దున్నాలని వివరించారు. పంట తెగుళ్ల బారినపడితే నివారణకు జీవామృతం, కషాయాలను పిచికారీ చేయాలని సూచించారు. సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పాగిరి అప్పలనాయుడు, ఏఈఓ ఎస్.విజయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ పద్మావతి, ఐసీఆర్పీలు తవిటినాయుడు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


వంగర: రుషింగి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ షేక్ శంకర్


రామభద్రపురం: గిరిజన గ్రామం ఎనుబరువులో పల్లెనిద్ర చేస్తున్న సీఐ నారాయణరావు

వంగర: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ఎవరైనా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ షేక్ శంకర్ హెచ్చ రించారు.మండలంలోని రుషింగి గ్రామంలో శనివారం పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి, చట్టాలు, సైబర్ నేరాలు,తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలని చెప్పారు.త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అనవసరమైన గొడవలు పెట్టుకోకుండా శాంతియు తం గా మెలగాలని, గ్రామంలోని కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గిరిజనంతో మమేకం

రామభద్రపురం: పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎనుబరువు గిరిజన గ్రామంలో శనివారం రాత్రి గిరిజన ప్రజలతో సీఐ కె.నారాయణరావు సమావేశమయ్యారు. సైబర్ నేరాలు,రోడ్డు ప్రమాదాలు,మత్తు పదార్థాలతో కలిగే అన ర్థాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అనంతరం అదే గ్రామంలో నిద్రచేశారు.

లోక్ అదాలత్‌లో 1,870 కేసులు పరిష్కారం


బొబ్బిలి: కేసులు పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి


రాజాం సిటీ: కేసులు పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

బొబ్బిలి: స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైంది. మొత్తం 1451 కేసులు పరిష్కారమయ్యాయి. సివిల్, భార్యా భర్తల తగాదాలు, క్రిమినల్, చెక్‌బౌన్స్, సారా, తదితర కేసులను మొదటి బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి బి.హెచ్.వి.లక్ష్మీకుమారి, రెండో బెంచ్‌లో జూనియర్ సివిల్ జడ్జి హేమ స్రవంతీజానకీ రామ్ పరిష్కరించారు. న్యాయవాదులు సీహెచ్.ఎల్.వి.ప్రసన్న కుమార్,ఆర్.వి.బి.ఎల్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాజాం కోర్టులో..

రాజాం సిటీ: స్థానిక కోర్టుల సముదాయంలో సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అధ్యక్షతన శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 419 కేసులు పరిష్కరించారు. ఇందులో సివిల్ కేసులు 4, భార్యా భర్తల తగాదాలు7, క్రిమినల్ కేసులు 50, చెక్‌బౌన్స్ కేసులు 2, సారా కేసులు 3, పెట్టీకేసులు 353 ఉన్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్‌అదాలత్ తీర్పే అంతిమమని చెప్పారు.కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్. హరిప్రియ, లోక్ అదాలత్ న్యాయవాదులు జి.తవుడు, బి.తిరుపతినాయుడు, న్యాయవాదులు కె.రమణమూర్తి, ఎస్.పోలారావు, రాజాం, రేగిడి, సంతకవిటి పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.